క్లుప్తంగా

పెదంకలాం పీహెచ్‌సీ సందర్శన



రిసెప్షన్ కౌంటర్‌లో ఓపీ అడిగి తెలుసుకుంటున్న ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్

సీతానగరం: ఎండల తీవ్రత కారణంగా ప్రజలు, ఉపాధి వేతనదారులు పొలాల్లో రైతులు వడదెబ్బ బారిన పడి అస్వస్థతకు గురయ్యే ఆస్కారం ఉన్నందున పీహెచ్‌సీలో వైద్యులు అందుబాటులో ఉండాలని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన మండలంలోని పెదం కలాం పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎండల తీవ్రత, ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గులు రావడంతో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారని గుర్తించినట్లు తెలియ జేశారు. ఈ మేరకు వైద్య సేవలందించడానికి పీహెచ్‌సీల్లో సిబ్బంది అందుబాటులో ఉండాలని చెప్పారు. అనంతరం పీహెచ్‌సీలో మందుల నిల్వలు, నిర్వహించే ఓపీ రికార్డులను, సిబ్బంది రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరాతీశారు. అనంతరం వైద్యాధికారి డాక్టర్ రాధాకాంత్‌తో వైద్య సేవలపై చర్చించారు.

బకాయి బిల్లులు చెల్లించండి



ఉపాధి హామీ పథకం కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వేతనదారులు

బలిజిపేట: మండలంలోని పెదపెంకి ఉపాధి వేతనదారులకు బకాయి బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఉపాధిహామీ పథకం కార్యాలయం వద్ద వేతనదారులు సోమవారం ధర్నా నిర్వహించారు. 692మందికి మూడు వారాల బిల్లులు బకాయి ఉందిన తక్షణమే చెల్లించాలని, మరికొన్ని గ్రూపులకు సంబంధించి గ్రూపులో కొంతమందికి డబ్బులు పడి మరికొంతమందికి జమ కాకపోవడంపై వేతనదారులు ఆగ్రహించారు. గ్రూపు అందరం కలిసి పనిచేస్తే కొందరికి డబ్బులు జమకావడం, మరికొందరికి కాకపోవడం ఏమిటని ఏపీఓ కేశవరావును ప్రశ్నించారు. కొంతమంది పేర్లు మస్టరులో నమోదు అవడం లేదని, దీనిపై తగువిధంగా స్పందించాలని డిమాండ్ చేశారు.

జ్వరాలు తగ్గేంతవరకూ వైద్య సేవలు



వైద్యారోగ్యశాఖ ప్రోగ్రాం అధికారి డాక్టర్ భాస్కరరావు

సీతానగరం: మండలంలో జ్వరాలు తగ్గుముఖం పట్టేవరకూ వైద్యసేవలు అందిస్తామని జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ భాస్కరరావు అన్నారు. ఈ మేరకు సోమవారం సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ ఉషారాణి ఆధ్వర్యంలో రెడ్డివానివలసలో జరుగుతున్న ఉచితవైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఎండల తీవ్రతకు గురైన ప్రజలు జ్వరాలబారిన పడాల్సి వచ్చిందన్నారు. శుక్రవారం గ్రామంలో వైద్యులు ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి సేవలందించారన్నారు. డాక్టర్ ఉషారాణి మాట్లాడుతూ ప్రభుత్వం అన్నిరకాల వ్యాధుల నివారణకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచిందన్నారు. గ్రామంలో జ్వరాలు తగ్గుముఖం పడుతున్నాయని స్పష్టం చేశారు. అయినా పూర్తి స్థాయిలో జ్వరాలు తగ్గేంతవరకూ క్షేత్రస్థాయిలో సిబ్బంది ఉంటారని చెప్పారు.

6 నుంచి వాలీబాల్, కబడ్డీ పోటీలు

వీరఘట్టం: వీరఘట్టం గ్రామదేవత పైడితల్లి అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా వచ్చే నెల 6 నుంచి స్థానిక జిల్లా పరిషత్ క్రీడా మైదానంలో వాలీబాల్, కబడ్డీ పోటీలను నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ తెలిపింది. ఈ మేరకు సోమవారం క్రీడా మైదానాన్ని జేసీబీతో చదును చేశారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో తాలాడ విద్యార్థినికి స్వర్ణం

భామిని: తాలాడకు చెందిన విద్యార్థిని వలరౌతు ఇందు కీర్తిక రాష్ట్రస్థాయి ఉషూ బంగారు పతకం సాధించి జిల్లాకు గుర్తింపు తీసుకొచ్చింది. ఈ నెల 23న గుంటూరు జిల్లా నల్లపాడులో జరిగిన రాష్ట్రస్థాయి సీనియర్ ఉషూ చాంపియన్ షిప్-2023లో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా తరఫున పాల్గొని 70 కిలోల విభాగంలో విజేతగా నిలిచింది. పూణేలో వచ్చే నెల 30న జరిగే జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఆమెను ఉమ్మడి జిల్లా ఉషూ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి శివకుమార్, భామిని కేజీబీవీ ఎస్ఓ బి.శారద, తదితరులు సోమవారం అభినందించారు.

అన్ని వర్గాల అభివృద్ధి జగనన్నతోనే సాధ్యం

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్:

రాష్ట్రంలోని అన్ని వర్గాల అభివృద్ధి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డితోనే సాధ్యమని, కుల, మత, రాజకీయాలకు తావు లేకుండా అర్హతే ప్రామాణికంగా ప్రజలకు లబ్ధి చేకూరుస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 206వ రోజు కార్యక్రమాన్ని మండలంలోని వెంకంపేట గ్రామంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గామంలోని ప్రతి గడప వద్దకు వెళ్లి ప్రజలను కలుసుకుని వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుని ఇంతవరకు ప్రభుత్వం వారికి చేకూర్చిన లబ్ధి, సంక్షేమ పథకాలను తెలియజేస్తూ ఇంకా వారికి ఏమైనా సమస్యలు ఉంటే అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగారావు గ్రామంలో విస్తృతంగా పర్యటించి అమ్మ ఒడి వచ్చిందా? రైతు భరోసా వచ్చిందా? పింఛన్ ఇంటివద్దకే వచ్చి ఇస్తున్నారా అంటూ ఆరా తీశారు. సంక్షేమ పథకాల అమలు తీరును వివరించిన ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందుతున్నాయో? అర్హులకు ఏదైనా అన్యాయం జరుగుతోందా? తదితర విషయాలు తెలుసుకునేందుకే తాము గ్రామానికి వచ్చామని వివరించారు. లబ్ధిదారులు సంతృప్తి చెందడంతో ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు.



ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

కుల,మత, పార్టీలకతీతంగా సంక్షేమం

అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా పార్టీలు, కులాలు, వర్గాలు, ప్రాంతాలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. సచివాలయాలు ఆయా గ్రామాల పరిధిలో ఉండడంవల్ల ప్రజలకు కూడా తమ సమస్యలను వెంటనే తెలియజేసి పరిష్కారం పొందుతున్నారని తెలిపారు. ప్రతి కుటుంబానికి ఏదో ఒక సంక్షేమ పథకం అందజేస్తూ పేదల అభివృద్ధికి ప్రభుత్వం అండగా నిలుస్తున్న తీరును ఓర్వలేక టీడీపీ, జనసేన నాయకులు కొందరు అర్థం లేని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రజల సంక్షేమాన్ని గాలికి వదిలేసి జన్మభూమి కమిటీల పేరుతో దోచుకున్న నాయకులు బాధుడే బాదుడు అంటూ మభ్యపెట్టే కార్యక్రమం చేపట్టడం విచారకరమని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మజ్జి శోభారాణి, జెడ్పీటీసీ బలగ రేవతమ్మ, ఏఎంసీ చైర్మన్ భాగ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ సిద్ధా జగన్నాథరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, పీఏసీఎస్ చైర్మన్ తీళ్ల శివున్నాయుడు, సర్పంచ్ తీళ్ల కృష్ణారావు, ఎంపీటీసీలు, స్టేట్‌కార్పొరేషన్ డైరెక్టర్లు, ఏఎంసీ డైరెక్టర్లు ,కోఆప్షన్ సభ్యులు,నాయకులు, కార్యకర్తలు జేసీఎస్ కన్వీనర్, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు, స్థానిక ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అమ్మవారు తరలివచ్చిన వేళ..



అమ్మవారిని గ్రామంలోకి ఆహ్వానిస్తున్న భక్తులు

పార్వతీపురం టౌన్: మేళతాళాలు.. భక్తుల జయ జయ ధ్వానాలు.. సాంస్కృతిక ప్రదర్శనల నడుమ అమ్మవార్లు తరలివచ్చిన వేళ భక్తులు ఉప్పొంగిపోయారు. ఆధ్యాత్మిక చింతనతో గడిపారు. భక్తిశ్రద్ధలతో పూజలు జరిపారు. పార్వతీపురం గ్రామదేవత ఇప్పల పోలమ్మ, ఎర్రకంచమ్మ పండగలు నిర్వహించేందుకు గ్రామపెద్దలు భారీ ఏర్పాట్లు చేశారు. పండగలో భాగంగా గ్రామ పొలిమేరలో ఉన్న ఎర్ర కంచమ్మ అమ్మవారిని సోమవారం రాత్రి గ్రామంలోకి ఆహ్వానించారు. అమ్మవారి ఘట్టాలతో 40 రోజులు ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. తొలిపూజను ధాట్రాజ్ కుటుంబ సభ్యులు నిర్వహిస్తారన్నారు. జగన్నాథపురం ఎర్ర కంచమ్మ పండగను కూడా ఇదే పద్ధతిలో నిర్వహిస్తామని కమిటీ నిర్వాహకులు తెలిపారు. గ్రామ దేవతల పండగ మే నెల 28, 29, 30న జరగన్నాయని, రెండు సిరిమాను మహోత్సవాలను సంబరంగా నిర్వహిస్తామని చెప్పారు.

త్వరితగతిన వైఎస్ఆర్ విగ్రహం పునఃప్రారంభం

- పనులను పరిశీలించిన ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: నియోజకవర్గ కేంద్రంలో గల ఆర్టీసీ కూడలి వద్ద నూతనంగా ఏర్పాటు చేయనున్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం నిర్మాణానికి అవసరమైన పనులు శరవేగంగా పూర్తవుతున్నాయని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులతో కలిసి విగ్రహం పనులను పరిశీలించారు. నూతన జిల్లా కేంద్రం, నియోజకవర్గ కేంద్రమైన పార్వతీపురంలో మహానేత విగ్రహం దశాబ్దకాలం క్రితం ఏర్పాటు చేశారు. ఇటీవల ఆ విగ్రహం డ్యామేజ్ అయిన కారణంగా అదే ప్రదేశంలో శాశ్వత ప్రాతిపదికన నూతన విగ్రహ నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు కంకణం కట్టుకున్నారు. ఈ మేరకు ఆయన సొంత నిధులతో నిర్మాణ పనులు చేయిస్తున్నారు. అతి త్వరలో నూతన విగ్రహం ప్రారంభించడానికి అవసరమైన ఏర్పాట్లు చకచకా పూర్తి చేస్తున్నామని ఎమ్మెల్యే జోగారావు ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పార్వతీపురం పట్టణ, మండల అధ్యక్షులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

విజయవంతమైన మెగా పీపుల్ సర్వే

- జగనన్నే మా భవిష్యత్‌కు అపూర్వ స్పందన
- సీఎం జగన్‌మోహన్ రెడ్డి పాలనపై పెరిగిన విశ్వాసం
- మీడియా సమావేశంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: రాష్ట్రవ్యాప్తంగా 15 వేల సచివాలయాల్లో 'జగనన్నే మా భవిష్యత్తు' పేరుతో ఏప్రిల్ 7వ తేదీన వైఎస్సార్‌సీపీ చేపట్టిన మెగా పీపుల్స్ సర్వే విజయవంతమైందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో 7 లక్షల మంది పార్టీ సైనికులు ప్రతి ఇంటిని సందర్శించి తాము, తమ పిల్లల భవిష్యత్తు కోసం ప్రజలు ఎవరిని విశ్వసిస్తున్నారనే అంశంపై వారి అభిప్రాయాలను ప్రజా మద్దతు పుస్తకంలో నమోదు చేసినట్లు తెలిపారు. ఈ మెగా పీపుల్స్ సర్వే కార్యక్రమానికి సంబంధించిన కీలక అంశాలు మధ్యంతర ఫలితాల నివేదికను మీడియా ముఖంగా వెల్లడిస్తున్నామని చెప్పారు. ఈ మేరకు సోమవారం ఆయన నియోజకవర్గ కేంద్రంలో గల వెంకటేశ్వర కల్యాణ మంటపంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకురాలు శోభా హైమావతితో కలిసి పార్వతీపురం అర్బన్, రూరల్ సచివాలయం కన్వీనర్లు, నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకుల సమక్షంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మెగా సర్వేలో వస్తున్న ఫలితాలు ప్రజల అభిప్రాయాన్ని ప్రతిబింబిస్తున్నాయని, జగనన్నే మా భవిష్యత్తు మెగా పీపుల్స్ సర్వేలో తొలి 15 రోజుల్లోనే 1 కోటి కుటుంబాలు పాల్గొనగా, సీఎం జగనన్న పాలనకు మద్దతుగా 79 లక్షలకు పైగా మిస్డ్ కాల్స్ వచ్చాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ మెగా సర్వేలో భాగంగా నియోజకవర్గంలో ఇంత వరకు 90% పైబడి కుటుంబాలను సందర్శించామని, రాబోయే రెండు రోజుల్లో మిగిలిన 10% కుటుంబాలను కూడా సందర్శించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు.

పాలనలో మంచిని వివరించాలనే ఉద్దేశం

కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నియోజకవర్గ పార్టీ పరిశీలకులు శోభా హైమావతి మాట్లాడుతూ కుల, మత, వర్గ, వివక్ష లేకుండా ప్రతిపక్షాలు బలంగా ఉన్నాయని భావించే ప్రాంతాలపై దృష్టి సారించి, సీఎం జగనన్న పాలనలో అక్కడి ప్రజలకు జరిగిన మంచిని వివరించాలనే ఉదేశంతో వైఎస్సార్‌సీపీ ముందుకు వెళ్తోందని, ఈ క్రమంలో చేపట్టిన కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా విజయవంతమైందన్నారు. అలాగే పార్వతీపురం నియోజకవర్గంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం ఎమ్మెల్యే సారథ్యంలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలవడానికి కృషి చేసిన ప్రతి ఒక్క వైఎస్సార్‌సీపీ కార్యకర్తకూ అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వాకాడ నాగేశ్వరరావు, మూడు మండలాలు, పట్టణ పార్టీ అధ్యక్షులు బొమ్మి రమేష్, పాలవలస మురళీకృష్ణ, బొంగు చిట్టి రాజు, కొండపల్లి బాలకృష్ణ, మూడు మండలాల జెడ్పీటీసీ అలజంగి రవికుమార్, మామిడి బాబ్జీ, బలగ రేవతమ్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్‌పర్సన్ కొండపల్లి రుక్మిణి, ఎంపీపీ మజ్జి శోభారాణి, మూడు మండలాల జేసీఎస్ కన్వీనర్లు, పట్టణ జేసీఎస్ కన్వీనర్, వైఎస్సార్‌సీపీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, సచివాలయం కన్వీనర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వార్డుల కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, స్టేట్ డైరెక్టర్లు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

26న వ్యవసాయ పరిశోధన సమావేశం

పార్వతీపురం: పార్వతీపురం ఉద్యాన కళాశాలలో ఈనెల 26న వ్యవసాయ పరిశోధన విస్తరణ సలహా మండలి సమావేశం నిర్వహించనున్నట్లు పరిశోధన సంచాలకుడు డాక్టర్ సురేష్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉన్నత పర్వతశ్రేణి గిరిజన మండల వ్యవసాయ పరిశోధన విస్తరణ సలహా మండలి సమావేశానికి జిల్లా అధికారులు, వ్యవసాయ పరిశోధన సంచాలకులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ ఉద్యాన అనుబంధ రంగాల అధికారులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

నేడు అంతర్జాతీయ మలేరియా నివారణ దినం

అంతర్జాతీయ మలేరియా నివారణ దినాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు మలేరియా జిల్లా సహాయ అధికారి డి.సూర్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం 8 గంటలకు మున్సిపల్ కార్యాలయంనుంచి ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ, పారిశుద్ధ్య, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొంటారని పేర్కొన్నారు.

బీజేపీతో దేశానికి ప్రమాదం



ప్రచార బహిరంగ సభలో మాట్లాడుతున్న వామపక్షాల నాయకులు

పాలకొండ రూరల్: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించకుంటే దేశానికి ప్రమాదం తప్పదని సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, సీపీఐ జిల్లా కార్యదర్శి కె.మన్మథరావు అన్నారు. పాలకొండ ఆటో స్టాండ్‌లో సోమవారం ప్రచారం భేరి, బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వామపక్ష నాయకులు మాట్లాడుతూ బీజేపీని నమ్మితే రాజకీయ పార్టీలకే కాకుండా ప్రజలకు తీవ్ర నష్టం ఏర్పడుతుందన్నారు. మోదీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బహుళజాతి, కార్పొరేట్ రంగాలు అందలమెక్కితే.. సామాన్యులు అధోగతి పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని అన్ని వర్గాలవారు సంఘటితంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే రాష్ట్రంలో విశాఖ ఉక్కును కాపాడుకోవటం, పోలవరం, రాజధాని నిర్మాణం తదితర అంశాలకు సంబంధించి కేంద్రం నుంచి నిధులు సాధించుకోవాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు ఎం.తిరుపతిరావు, దావాల రమణరావు, కాద రాము, జి.జనార్దనరావు, సుందరమ్మ తదితరులున్నారు.

రోగులకు అసౌకర్యం కలిగించొద్దు



ఓపీ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ అప్పారావు

కొమరాడ: విద్యుత్ సరఫరా నిలిచిపోయినపుడు రోగులు అసౌకర్యానికి గురికాకుండా జనరేటర్‌ను అందుబాటులో ఉంచాలని ఎంపీడీఓ ఎల్.వి.అప్పారావు అన్నారు. మండలంలోని కూనేరు రామభద్రపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఇన్ పేషెంట్స్, అవుట్ పేషెంట్స్ రికార్డులు, వార్డులను పరిశీలించారు. మందుల నిల్వలపై ఆరా తీశారు. రోగులకు సకాలంలో మెరుగైన వైద్య సేవలందించేందుకు కృషిచేయాలని వైద్యసిబ్బందికి సూచించారు.

మలేరియా నిర్మూలనే లక్ష్యం

భామిని: అన్ని గ్రామాలను మలేరియా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని భామిని వైద్యాధికారి డాక్టర్ ఎస్.ఫణికుమార్ కోరారు. మండలంలోని బొమ్మికలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 25న జాతీయ మలేరియా నిర్మూలన దినోత్సవం సందర్భంగా గ్రామాల్లో అవగాహన కల్పించాలని సూచించారు.

ఘనంగా పంచాయతీ రాజ్ దినోత్సవం



పార్వతీపురం టౌన్: సర్పంచ్‌లకు ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

- ఉత్తమ పంచాయతీలకు ప్రశంసాపత్రాలు అందజేసిన ఎమ్మెల్యే

పార్వతీపురంటౌన్: పార్వతీపురం ఎంపీపీ మజ్జి శోభారాణి అధ్యక్షతన జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక శాసనసభ్యుడు అలజంగి జోగారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా గడిచిన 2022-23 ఆర్థిక సంవత్సరంలో మండల స్థాయిలో ఉత్తమ సేవలు కనబరిచిన కవిటిభద్ర, కోరి గంగాపురం, కృష్ణపల్లి, అడ్డాపుశీల, పులిగుమ్మి, పెదబొండపల్లి గ్రామాల పంచాయతీ సర్పంచ్‌లు, సచివాలయ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులను ఎమ్మెల్యే, మండల ప్రజా ప్రతినిధులు ఘనంగా సన్మానించి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పంచాయతీ రాజ్ వ్యవస్థను పటిష్ఠం చేయడం కోసం కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో ఈ దినోత్సవం నిర్వహించామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్ రెడ్డి గ్రామ స్థాయిలో ప్రభుత్వ సేవలను పూర్తి స్థాయిలో విస్తృతం చేస్తూ గ్రామ సచివాలయం, వలంటరీ వ్యవస్థలను తీసుకువచ్చి పంచాయతీ పాలనను మరింత పటిష్ఠం చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ, ఈఓపీఆర్‌డీ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు, వివిధ శాఖల అధికారులు, గ్రామ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



సీతానగరంఫ బగ్గందొరవలస పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావును సత్కరిస్తున్న ఎంపీడీఓ

సీతానగరంలో..

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ ఆధ్వర్యంలో జాతీయ పంచాయతీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిడగల్లు, పాపమ్మవలస, ఇప్పలవలస, చెల్లంనాయుడువలస, కొత్తవలస, బగ్గందొరవలస, చినభోగిలి గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, కార్యదర్శులను ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు బి శ్రీరాములు సత్కరించారు.

2024లో జగన్ ప్రభంజనం ఖాయం



మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

- వైఎస్సార్‌సీపీకే ప్రజల మద్దతు
- వైఎస్సార్‌సీపీ నాయకులు

సాలూరు: రాష్ట్ర ప్రజలంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ, అభివృద్ధి పాలనకు జేజేలు పలుకుతున్నారని.. 2024లో మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం ఖాయమని పట్టణ జేసీఎస్ కన్వీనర్ గిరి రఘు, ప్రజా ప్రతినిధులు, నాయకులు అన్నారు. జగనన్నే మా భవిష్యత్ మెగా పీపుల్స్ సర్వే కార్యక్రమం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా కోటి కుటుంబాలను కలిసిన నేపథ్యంలో పట్టణంలోని ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర నివాసం వద్ద సోమవారం విలేరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో సుమారు 98 శాతం అమలు చేసిన జగన్ మోహన్‌రెడ్డికి ప్రజలు మద్దతు పలుకుతున్నారని చెప్పారు. గత చంద్రబాబు పాలనకు, ప్రస్తుత జగనన్న సంక్షేమ పాలన మధ్య తేడాలను ప్రజలు గుర్తిస్తున్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ పాలనలో తమకు అన్నివిధాలా మేలు జరిగినట్లు ప్రజలు చెబుతున్నారన్నారు. 2024 ఎన్నికల్లో జగన్ మోహన్‌రెడ్డి ప్రభంజనం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఓటమి భయాన్ని ముందుగానే గుర్తించిన ప్రతిపక్ష పార్టీలు, ఎల్లో మీడియా కావాలనే దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్లు, నాయకులు గొర్లె జగన్‌మోహనరావు, జర్జాపు సూరిబాబు, మాధవరావు, వెంకటరావు, అప్పలస్వామి, దాలినాయుడు, రామకృష్ణ, శ్రీను, ఈశ్వరరావు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖాధికారులపై సస్పెన్షన్ రద్దు చేయాలి

పార్వతీపురం టౌన్: విద్యాశాఖాధికారులపై రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్ విధించిన సస్పెన్షన్‌ను రద్దు చేసి, ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని యూటీఎఫ్, ఏపీటీఎఫ్, ఏపీఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక విద్యాశాఖ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వలేదనే కారణంతో విద్యాశాఖలో పనిచేస్తున్న డీఈఓ, కేజీబీవీ ఎస్ఓ, అసిస్టెంట్ జీసీడీఓ, ఎంఈఓలపై సస్పెన్షన్ విధించడం సరికాదన్నారు. పుస్తకాలను పూర్తిస్థాయిలో సరఫరా చేయకపోతే విద్యార్థులకు ఎలా పంపిణీ చేస్తారని ప్రశ్నించారు. వీరఘట్టం కేజీబీవీ పాఠశాలకు శ్రీకాకుళం జిల్లానుంచి పాఠ్యపుస్తకాల కోసం ప్రతిపాదనలు చేసి పంపిణీ చేశారన్నారు.

శ్రీకాకుళం జిల్లా నుంచి పంపిణీ అయిన పుస్తకాలకు పార్వతీపురం మన్యం జిల్లా అధికారులను బాధ్యులను చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. తక్షణమే సస్పెన్షన్ ఉత్తర్వులను వెనక్కు తీసుకోవాలని ఏపీ ఎస్సీఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం, యూటీఎఫ్, ఏపీటీఎఫ్ నాయకులు జి.మురళీమోహన్, బాలకృష్ణతోపాటు పలువురు కోరారు.

పాఠశాలల అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

పాలకొండ రూరల్: ప్రభుత్వ పాఠశాలలో విద్యా ప్రమాణాల మెరుగుతోపాటు అభివృద్ధిపై ఉపాధ్యాయులు మరింత దృష్టి సారించాలని ఎంఈఓ మీసాల సూర్యనారాయణ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండలంలోని హెచ్‌ఎంలకు సోమవారం ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. స్టేట్ రిసోర్సుపర్సన్లు గారాల సూర్యనారాయణ, కె.జనార్దనరావు పాఠశాలల సామాజిక తనిఖీలపై పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయులు, ప్రజలు, తల్లితండ్రులు, పాఠశాలల అభివృద్ధి కమిటీలు సంయుక్తంగా నిర్వహించాల్సిన విధివిధానాలపై అవగాహన కల్పించారు. సమగ్ర పాఠశాల మూల్యాంకనం అనే యాప్‌లో నమోదు చేయాల్సిన వివరాలు తెలియజేశారు. ఈ నెల 28 నాటికి శతశాతం నమోదు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. హెచ్‌ఎంలు జామి రవి, జి.రేణుకాదేవి, ప్రతాపరుద్రుడు, వి.లక్ష్మణరావు, వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రిసోర్సుపర్సన్ సూర్యనారాయణ

గ్రీన్ అంబాసిడర్లకు సత్కారం



గ్రీన్ అంబాసిడర్లను సత్కరిస్తున్న సర్పంచ్ అప్పమ్మ, నాగమణి

సీతానగరం: మండలంలోని చెల్లంనాయుడువలస పంచాయతీలో నిరంతరం సేవలందిస్తున్న గ్రీన్అంబాసిడర్లను జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సర్పంచ్ వి.అప్పమ్మ ఆధ్వర్యంలో గ్రామస్తులు సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అప్పమ్మ, మాజీ సర్పంచ్ వి. పారినాయుడు మాట్లాడుతూ గ్రామంలో పారిశుద్ధ్య పనులు, తడి, పొడి చెత్త సేకరించే పనుల్లో నిమగ్నమైన గ్రీన్ అంబాసిడర్ల రుణం తీర్చుకోలేనిదని ప్రశంసించారు. గ్రీన్‌అంబాసిడర్లు ఈశ్వర రావు, సీహెచ్ అప్పలనాయుడులను సత్కరించిన వారిలో మాజీ ఎంపీటీసీ డి.నాగరత్నం, మాజీ సర్పంచ్ డి చిన్నంనాయుడు ,గ్రామ వలంటీర్లు, వార్డు సభ్యులు ఉన్నారు.

27న బహిరంగ వేలం

సాలూరు: రూరల్ స్టేషన్ పరిధిలో సారా కేసుల్లో సీజ్ చేసిన వాహనాలకు ఈనెల 27న వేలంపాట నిర్వహించనున్నట్లు రూరల్ ఎస్సై ప్రయోగమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫోర్ వీలర్స్ వాహనాలు రెండు, త్రీ వీలర్స్ వాహనాలు మూడు, ద్విచక్రవాహనాలు ఏడు మొత్తం 12 వాహనాలను వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. రూరల్ స్టేషన్ ఆవరణలో నిర్వహించే ఈ బహిరంగ వేలంలో ఆసక్తి గల వారు పాల్గొనాలని కోరారు.